క్లుప్తంగా

కార్మికుల పక్షాన ఐఎన్‌టీయూసీ పోరాటం



కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న దేవిభూమయ్య

కాసిపేట: కార్మికుల పక్షాన ఎల్లప్పుడు ఐఎన్‌టీయూసీ పోరాడుతుందని మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవిభూమయ్య తెలిపారు. శుక్రవారం మందమర్రి ఏరియా కాసిపేట2 గనిపై కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు యాజమాన్యం కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. ఈఅండ్‌ఎం సెక్షన్‌కు షెడ్ లేక ఉన్న చిన్నషెడ్‌లో సామగ్రి పెట్టుకుని ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఏరియా కార్యదర్శి దొరిశెట్టి చెంద్రశేఖర్, బత్తుల వేణు, కేంద్రకమిటీ కార్యదర్శి అరకొండ శేఖర్, ఈద యాదగిరి, దేవ రమేశ్, సుధాకర్, ఫిట్ కార్యదర్శి కొప్పుల బాపు, తొంగల కుమార్ పాల్గొన్నారు.

నలుగురికి ఉపాధి కల్పించేస్థాయికి ఎదగాలి



సర్పంచ్ కృష్ణను సన్మానిస్తున్న శిక్షణ పొందిన కార్మికులు

కాసిపేట: నైపుణ్య శిక్షణ పొందిన కార్మికులు నలుగురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని పెద్దనపల్లి సర్పంచ్ వేముల కృష్ణ అన్నారు. మండలంలోని పెద్దనపల్లి పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో నేషనల్ అకాడమీ అఫ్ క్రాఫ్ట్ (నాక్) ఆధ్వర్యంలో 15రోజులపాటు నిర్వహించిన నైపుణ్య శిక్షణ తరగతులు శుక్రవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో శిక్షణ పొందిన కార్మికులు సర్పంచ్‌ను సన్మానించారు. శిక్షణ బృందం అధికారి శంకర్, కార్మికులు తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ ఎదుట నలుగురి బైండోవర్



బైండోవర్ చేసిన పోలీసులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ తహసీల్దార్ రాజలింగు ఎదుట శుక్రవారం నలుగురిని పోలీసులు బైండోవర్ చేశారు. గుడిపేటకు చెందిన లగిశెట్టి సత్తయ్య, అతని భార్య లగిశెట్టి పుష్ప, పెద్దంపేటకు చెందిన ముక్కెర శంకరయ్య, అతని భార్య నందాలను ఓ భూతగాద కేసుల్లో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్సై నరేశ్ కుమార్ ఆధ్వర్యంలో బైండోవర్ చేశారు.

ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలి



మాట్లాడుతున్న అక్మాల్ పాషా

చెన్నూర్‌రూరల్: పేదలకు ఇళ్ల స్థలాల కోసం పట్టాలివ్వాలని, ఇంటి నిర్మించుకునేందుకు రూ.10 లక్షలు అందించాలని తెలంగాణ అవాజ్ కమిటీ రాష్ట్ర నాయకుడు అక్మాల్ పాషా అన్నారు. మండలంలోని బావురావుపేట సమీపంలో ఇళ్ల స్థలాల పోరాటం 48వ రోజు చేరుకోగా శుక్రవారం ఆయన వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మైనార్టీలకు ముస్లిం బంధు అమలు చేయాలన్నారు. వెనుకబడిన వారి కోసం నిధిని ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. మైనారిటీ పేదలకు డబుల్ బెడ్రూంలు ఇవ్వాలన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యుడు బోడంకి చందు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్, నాయకులు ఎండీ అవేజ్, చంద్రన్న, అనిల్, అవాజ్ నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

భీమిని: కన్నెపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వివిధ గ్రామాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు శుక్రవారం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్యనారాయణ, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నిరంజన్‌గుప్తా, తహసీల్దార్ రాంచందర్, వైస్ ఎంపీపీ రాకేశ్‌శర్మ, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ శ్రీరామరావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆకుతోట రాజన్న, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పగలే వెలుగు

భీమారం: మంచిర్యాల-చెన్నూరు జాతీయ రహదారిపై భీమారంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ లైట్లు పగలు, రాత్రి వెలుగులు ఇస్తున్నాయి. రాష్ట్రమంత్రి హరీశ్‌రావుతో ప్రారంభోత్సవం చేసిన అనంతరం చాలా రోజులు అవి పనిచేయలేదు. మధుకాన్ సంస్థ ఆ లైట్లలో కొన్నింటికి మరమ్మతు చేసింది. అయితే సెంట్రల్ లైట్లు రాత్రి వెలుగులు ఇస్తోంది. ఉదయం స్విచ్ ఆఫ్ చేయకపోవడంతో అవి నిరంతరంగా వెలుగుతూనే ఉన్నాయి. కాని దాదాపు 58 స్తంభాల్లో ఇంకా కొన్ని పనిచేయడం లేదని స్థానికులు పేర్కొంటున్నారు. దాదాపు రూ.70 లక్షలు వ్యయం చేసి ఏర్పాటు చేసిన లైట్లు కొన్నిచోట్ల వెలగడం లేదు. మరికొన్ని చోట్ల 24 గంటలు వెలుగుతున్నాయి. సెంట్రల్ లైటింగ్ వ్యవస్థకి సిబ్బందిని నియమించి రాత్రి వెలిగేలా చూడాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.



ఆదమరిస్తే..కాల్వలోకే..!



దండేపల్లి: మండలంలోని తాళ్లపేటలో డిస్ట్రిబ్యూటరీ 23 కాల్వను ఆనుకుని ఉన్న ఇళ్ల వైపు ఇటీవల సీసీ రోడ్డు నిర్మించారు. ఓ చోట డిస్ట్రిబ్యూటరీ కాల్వ దాటేందుకు చిన్న కల్వర్టు కూడా ఉంది. కల్వర్టుపై నుంచి సీసీ రోడ్డు వేశారు. కల్వర్టుకు ఎలాంటి రక్షణ దిమ్మెలు లేకపోవడంతో ఏ కొంచెం ఆదమరిచిన కాల్వలో పడిపోవడం ఖాయం. అధికారులు స్పందించి కల్వర్టుకు ఇరువైపులా రక్షణ దిమ్మెలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

బండి సంజయ్ సభ విజయవంతం చేయాలి

మంచిర్యాలటౌన్: ప్రధానిగా మోదీ తన 9 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ ఆధ్వర్యాన మహాజన సంపర్క అభియాన్‌లో భాగంగా మంచిర్యాల నియోజకవర్గ పరిధిలో ఈనెల 21న జరిగే రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు. జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మే 30 నుంచి జూన్ 30వ తేదీ వరకు మహాజన సంపర్క అభియాన్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని అన్నారు. మంచిర్యాల నుంచి చలో లక్సెట్టిపేట్ భారీ బహిరంగ సభకు 2 వేల మంది కార్యకర్తలు, అభిమానులను తరలించేందుకు మంచిర్యాల పట్టణ 26 శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు కృషి చేయాలన్నారు. పట్టణ కార్యదర్శులు బోయిని హరికృష్ణ, గాజుల ప్రభాకర్, ప్రోగ్రాం ఇన్‌చార్జి పానగంటి మధు, పట్టణ ఇన్‌చార్జి ఆరుముల్ల పోషం, అసెంబ్లీ కన్వీనర్ మల్లికార్జున్, రాజశేఖర్, వెంకటేశ్వర్లు, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రగతితో మారిన రూపురేఖలు

- అసిస్టెంట్ కలెక్టర్ గౌతమి
- ఘనంగా పట్టణ ప్రగతి దినోత్సవం
- జాతీయ జెండాలు ఆవిష్కరణ
- ర్యాలీలు, మానవహారం



చెన్నూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు పాలకవర్గ సభ్యులు

చెన్నూర్: పట్టణ ప్రగతి ద్వారా ప్రభుత్వం అందించే నిధులతో పట్టణాల రూపురేఖలు మారాయని అసిస్టెంట్ కలెక్టర్ గౌతమి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెన్నూర్‌లో శుక్రవారం పట్టణ ప్రగతి దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బాలాజీ గార్డెన్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ముందుగా పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, పట్టణ ప్రజలతో ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ పట్టణ ప్రగతితో మున్సిపాలిటీలో అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాయన్నారు. వేడుకల సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్మికులు, కౌన్సిలర్లను సన్మానించారు. డీఆర్‌డీవో శేషాద్రి, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, వైస్ చైర్మన్ నవాజ్, ఏఈ సాయికిరణ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీని ఎమ్మెల్యే దివాకర్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ కార్మికులను సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ వెంకటేశ్ పాల్గొన్నారు.

నస్పూర్: నస్పూర్‌లో మున్సిపల్ అధికారులు, సిబ్బంది సీసీసీ కార్నర్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. అనంతరం సీసీసీ కార్నర్ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. చైర్మన్ ప్రభాకర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన రెవెన్యూ అధికారి కె.సతీశ్‌రావు, బిల్ కలెక్టర్ మంథని శివరామకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పిట్టల ప్రభాకర్, జవాన్ ఏ.వెంకటస్వామి, పారి శుధ్య కార్మికులు జూల మల్లయ్య, రాజబాబు, వడ్లకొండ ప్రభాకర్, కలగూర రజితలను సుమంగళి ఫంక్షన్‌లో ఎమ్మెల్యే దివాకర్‌రావు, అదనపు కలెక్టర్ బి.రాహుల్ సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. వైస్ చైర్మన్ తోట శ్రీనివాస్, కమిషనర్ రమేశ్, కౌన్సిలర్లు ప్రభాకర్, గంగ, సత్యనారాయణ, మహేశ్, మల్లయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో నిర్వహించిన పట్టణ ప్రగతి దినోత్సవంలో ప్రభుత్వ కార్యక్రమాల ఫొటోలు, వీడియోలను డాక్యుమెంటరీ తయారు చేసి అందిస్తున్న ఉమా యాడ్స్ ప్రొప్రైయిటర్ జక్కుల రాజును అడిషనల్ కలెక్టర్ బి.రాహుల్, ఎమ్మెల్యే దివాకర్‌రావు సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ పెంట రాజయ్య, కమిషనర్ మారుతిప్రసాద్ ఉన్నారు.

రామకృష్ణాపూర్: క్యాతనపల్లి మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ జంగం కళ జెండా ఆవిష్కరించారు. స్థానిక రాజీవ్‌చౌక్‌లో మానవహారంగా ఏర్పడి అనంతరం అక్కడి నుంచి విఠల్‌నగర్ జయశంకర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. మున్సిపాలిటీ నర్సరీలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, వైస్ చైర్మన్ సాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మున్సిపల్ కార్యాలయ ఆవరణలో స్పెషల్ ఆఫీసర్, జెడ్పీ సీఈవో నరేందర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అంతకుముందు పలు వార్డుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. పలు రంగాల్లో సేవలందించిన వారిని సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ గద్దె రాజు, డీఈ సుమతి, ఏఈ అచ్యుత్, పార్టీల నాయకులు ఉన్నారు.



లక్సెట్టిపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



రామకృష్ణాపూర్ జెండా ఆవిష్కరిస్తున్న చైర్‌పర్సన్



మందమర్రి మున్సిపల్ కార్యాలయ ఆవరణలో..



పారిశుధ్య కార్మికురాలికి ప్రశంసాపత్రం అందిస్తున్న అడిషనల్ కలెక్టర్, ఎమ్మెల్యే

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని వేంపల్లి, రాపల్లి, బుద్ధిపల్లి గ్రామాల్లో డీఎంఎఫ్‌టీ నిధుల కింద చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దివాకర్‌రావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. వేంపల్లిలో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన అనంతరం రూ.20 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నూతనంగా నిర్మాణం చేపట్టనున్న కల్వర్టు పనులకు భూమి పూజ చేశారు. రూ. 30 లక్షలతో రాపల్లిలో, బుద్ధిపల్లిలో రూ. 5 లక్షలతో కల్వర్టుల పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. సర్పంచులు శారద, మల్లేశ్, మధుసూధన్ రెడ్డి, ఎంపీపీ స్వర్ణలత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్, జెడ్పీ కోఆప్షన్ నహీంపాషా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జీవన్‌రావు పాల్గొన్నారు.



వేంపల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు, సర్పంచ్ శారద

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కాసిపేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హరితహారం కార్యక్రమంపై అటవీశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండలంలోని మోడల్‌స్కూల్‌లో జరిగిన ఈ పోటీల్లో ముత్యంపల్లి, కాసిపేట జెడ్పీ, కేజీబీవీ, మోడల్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. ఈనెల19న నిర్వహించే హరితహారం కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందిస్తామని డెప్యూటీ రేంజ్ అధికారి ప్రవీణ్ నాయక్ తెలిపారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగమల్లయ్య, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం రాథోడ్ రమేశ్ ఉన్నారు.



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఆన్‌లైన్ క్విజ్ సద్వినియోగం చేసుకోవాలి

కాసిపేట: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్‌ను యువత సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల కృష్ణ కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రియాంకగాంధీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా టీపీసీసీ తలపెట్టిన రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనాలనేవారు 7661899899నంబర్‌కు మిస్డ్‌కాల్ ఇచ్చి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. వారికి హాల్‌టికెట్ కేటాయిస్తారని, జూన్18న ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పరీక్ష ఉంటుందని అన్నారు. పోటీలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తారని తెలిపారు. అనంతరం ఆన్‌లైన్ క్విజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ మండల మాజీ అధ్యక్షుడు సిద్దం తిరుపతి, ఎంపీటీసీ భీంరావు, ఉప సర్పంచ్ కనుకుల రాకేశ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గోలేటి స్వామి, నాయకులు కొత్త రమేశ్, షకీర్, మహంకాళి, జాడి శివ, వెంకటేశ్, చిలుకయ్య పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

శ్రీరాంపూర్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని శ్రీరాంపూర్ జీఎం బి.సంజీవరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో స్వచ్ఛత పక్వాడ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్రం ఆదేశాలతోనే సింగరేణి వ్యాప్తంగా ఈనెల 16 నుంచి 30 వరకు నిర్వహించే ‘స్వచ్ఛత పక్వాడ’ను విజయవంతం చేయాలని కోరారు. పని చేసే చోట, నివాసాల చుట్టూ చెత్తాచెదారం లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏజెంట్ ఏవి రెడ్డి, డీజీఎం చిరంజీవి, సీనియర్ పీవో కాంతారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న జీఎం సంజీవరెడ్డి

మార్కెట్ కమిటీల ద్వారా వేతనాలు చెల్లించాలి


పాతమంచిర్యాల: జిల్లాలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల ద్వారా వేతనాలు చెల్లించాలని సెక్యూరిటీ గార్డులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఏవో సురేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఐదు వ్యవసాయ మార్కెట్‌లోని చెక్‌పోస్టుల వద్ద పనిచేస్తున్న 19 మంది సెక్యూరిటీ గార్డులకు వేతనాలు, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా తెలంగాణలో ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్యూరిటీ గార్డు యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్‌కుమార్, అధ్యక్షుడు పి.రమేశ్, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, కోశాధికారి వై.రమేశ్, సెక్యూరిటీ గార్డులు స్వప్న, వందన, జనార్దన్, వెంకన్న, సతీశ్, మోహన్ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఏవో సురేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న సెక్యూరిటీ గార్డులు

అక్రమంగా ఇసుక తరలింపు

దండేపల్లి: మండలంలోని కాసిపేట గోదావరి తీరం నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అధికా రులు చూసీచూడనట్టుగా వ్యవహరించడంతో ఇసుక వ్యా పారులు తమ అక్రమ దందాకు అడ్డు అదుపు లేకుండా సాగిస్తున్నారు. నదిలో నీళ్ల నిల్వ ఉన్నప్పటికి, నీరు అడుగంటిన ప్రదేశానికి వెళ్లి అక్కడ నుంచి ఇసుకను ట్రాక్టర్లలో నింపి తరలించాల్సిన చోటికి తరలిస్తూ, సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ హన్మంతరావును సంప్రదించగా, ఇసుక తరలింపునకు అనుమతులు లేవు, అక్రమంగా తరలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



సంక్షిప్త వార్తలు

గిరిజన ఉత్సవాలు విజయవంతం చేయాలి

కాసిపేట: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం నిర్వహించే గిరిజన ఉత్సవాలను విజయవంతం చేయాలని తహసీల్దార్ దిలీప్ కుమార్ కోరారు. మండలంలోని మల్కేపల్లిలో ప్రత్యేకాధికారి, వయోజన విద్య ప్రాజెక్ట్ ఆఫీసర్ పురుషోత్తంతో కలిసి శుక్రవారం ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉత్సవాల్లో ఎలాంటి లోటు లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. సర్పంచ్ లక్ష్మి, ఉపసర్పంచ్ జనార్దన్, ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం నర్సింహం, గ్రామ పటేల్ సిడాం జంగు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛత పక్వాడాపై అవగాహన

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో శనివారం ఈనెల 30 వరకు స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం నిర్వహించనున్నట్లు జీఎం మోహన్‌రెడ్డి తెలిపారు. ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలో శుక్రవారం స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఏరియాలో పచ్చదనం, పరిశుభ్రత, పలుచోట్ల మొక్కలు నాటడం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి, సీనియర్ పీవో మైత్రేయబంధు, అధికారులు యూనియన్ల ప్రతినిధులు ఉన్నారు.

నేటి నుంచి ఇంటింటికీ సర్వే

జన్నారం: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ఈనెల 17 నుంచి ఇంటింటికీ సర్వే నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఇట్యాల కిషన్ శుక్రవారం తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ఓటు హక్కు లేని వారిని నమోదు చేయించడం, రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నవారిని గుర్తించడం, ఓటరు లిస్టులో పేరు ఉండి ప్రస్తుతం ఊర్లో లేని వారి వివరాలు సేకరించనున్నట్లు పేర్కొన్నారు. సర్వే సిబ్బందికి గ్రామాల్లోని ప్రజలు సహకరించాలని కోరారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

చెన్నూర్‌రూరల్: మండలంలోని సుందరసాల గ్రామంలో పంచాయతీ తరఫున శుక్రవారం సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్ల వద్ద మొత్తం ఆరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించినట్లు సర్పంచ్ పాగె రాజమల్లు తెలిపారు. గ్రామంలో ఎలాంటి సంఘటనలు జరిగినా సీసీ కెమెరాల ద్వారా రికార్డు అవుతుందన్నారు.

22న భీమారం మండల సమావేశం

భీమారం: ఈనెల 22న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు సభ్యులు, అధికారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

చెన్నూర్: పట్టణంలోని సురక్ష హాస్పిటల్‌లో మంచిర్యాల శ్రీహర్ష ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన వివిధ గ్రామాల నుంచి 200 మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. వైద్యులు దుర్గవినోద్, గౌతమ్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక అక్షరాభ్యాసం

తాండూర్: మండలంలోని బోయపల్లి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రవేశం పొందిన పిల్లలకు శుక్రవారం అక్షరాభ్యాసం జరిగింది. ఐసీడీఎస్ నుంచి 10 మంది విద్యార్థులు చేరగా, వారితో సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. హెచ్‌ఎం మధుసూదన్, ఉపాధ్యాయులు సుధ, పరిమళ, లత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మమత, కార్యకర్తలు పూలవతి, భాగ్యలక్ష్మి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అక్షరాభ్యాసం చేయిస్తున్న టీచర్లు, అంగన్ వాడీలు

కొయ్యల ఏమాజీకి సన్మానం

మంచిర్యాలటౌన్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన కొయ్యల ఏమాజీ శుక్రవారం మంచిర్యాలకు రాగా, పార్టీ నాయకులు సన్మానించారు. రాబోయే ఎన్నికల్లో బెల్లంపల్లి అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందాలని ఆకాంక్షించారు. పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లారెడ్డి, మాజీ ఉపాధ్యక్షుడు గోలి రామన్న, జిల్లా ఉపాధ్యక్షులు అశోక్ వర్ధన్, పులగం తిరుపతి, మాజీ జిల్లా అధ్యక్షుడు మున్నారాజా సిసోడియా, మాజీ కార్యదర్శి మల్లేశ్, జిల్లా అధికార ప్రతినిధి తుల మధుసూదన్, పట్టణ ఉపాధ్యక్షుడు ప్రదీప్ పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు

కాసిపేట: ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ ఫలితాలను రాష్ట్ర విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసింది. మండలంలోని ముత్యంపల్లి కేంద్రంలో ఓపెన్ టెన్త్‌లో 87 శాతం, ఇంటర్‌లో 83 శాతం ఫలితాలు సాధించినట్లు మండల ఓపెన్‌స్కూల్ కోఆర్డినేటర్ రాథోడ్ రమేశ్ తెలిపారు. పదిలో 28 మంది హాజరు కాగా, 26 మంది ఉత్తీర్ణత సాధించారని, ఇంటర్‌లో 46 మందికి 38 మంది ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఫలితాలు చూసుకుని మార్కుల జాబితాలో ఏమైన పొరబాట్లు ఉంటే జూలై 11లోగా స్టడీ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్‌పై ఈనెల 2 నుంచి జూలై 4లోగా మీసేవలో దరఖాస్తులు చేసుకోవచ్చునని పేర్కొన్నారు.